**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**
**Telangana State Committee**
M.B.Bhavan, H. No.1-1-60/2, RTC 'X' Roads, Hyderabad -20.
Ph. 040- 27665011 /12, Fax : 27665013, Email-cpimtelangana@gmail.com

ప్రచురణార్థం/ ప్రసారార్థం: **తేది:24.03.2022**

# ల్యాండ్ పూలింగ్ పేరుతో పేదల అసైన్డ్ భూములను లాక్కోవద్దు

చట్టాలను అమలు జరపాల్సిన ప్రభుత్వం అందుకు వ్యతిరేకంగా దశబ్దాల క్రితం నుండి పేదలకిచ్చిన అసైన్డ్ భూములను "ల్యాండ్ పూలింగ్" పేరుతో బలవంతంగా ఆక్రమించి ప్లాట్లు చేసి అమ్ముకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నది. చట్టాలను అమలు చేయాల్సిన ప్రభుత్వం తాను చేసిన చట్టాలనే ఉల్లంఘించడం అన్యాయం. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాన్ని సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నది.

రాష్ట్రంలో 1956 నుండి 2014 వరకు 13.88 లక్షల ఎకరాల భూమిని 22.56 లక్షల మందికి అసైన్డ్ చేసారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఓసీలకు ఈ భూములను ప్రభుత్వం పంపిణీ చేసింది. ఎస్సీలకు 5.76 లక్షల ఎకరాలు, ఎస్టీలకు 6.73 లక్షల ఎకరాలు పంపిణీ చేసారు. ఈ భూముల్లో దాదాపు 2.8లక్షల ఎకరాలను ప్రభుత్వం అమ్మింది. బ్రతుకుదెరువుకోసం పేదలకు అసైన్డ్ చేసిన భూములను ప్రస్తుత టీఆర్ఎస్ ప్రభుత్వం లాక్కుని ప్లాట్లు చేసి ప్రభుత్వ ఖజానాను నింపుకోవాలనే ప్రయత్నం చేస్తున్నది. అంతేకాక రియల్ ఎస్టేట్ వ్యాపారులకు తక్కువ ధరలకు భూములను కట్టబెట్టి వారిని కోటీశ్వరులను చేయాలనుకుంటున్నది. పట్టణాలకు దగ్గరగా అసైన్డ్ అయిన భూముల విలువ విపరీతంగా పెరిగింది. కొన్ని చోట్ల ఎకరాకు కోటి రూపాయలకు పైగా పలుకుతున్నది. అలాంటి భూముల నుండి పేద అసైన్డ్దారులను బలవంతంగా బయటకు పంపి ప్రభుత్వం జెండాలు పాతి శాంతి–భద్రతల సమస్యను సృష్టిస్తున్నది. తమ హక్కుల సాధనకు ప్రజలు ఉద్యమాల్లోకి వస్తే చట్ట విరుద్ధంగా వారిపైనే కేసులు పెట్టి, నిర్బంధం ప్రయోగించి భూములు లాక్కుంటున్నది.

ఇప్పటికీ రాష్ట్రంలో 86వేల ఎకరాల సీలింగ్ భూములు అక్రమంగా భూస్వాముల ఆధీనంలోనే ఉన్నాయి. వీటితో పాటు ప్రభుత్వ బంజర్లు, ఫారెస్ట్ బంజర్లతో పాటు, ఆక్రమించిన అసైన్డ్భూములు కూడా భూస్వాముల ఆధీనంలో ఉన్నాయి. వాటి జోలికెళ్ళకుండా పేదలను బెదిరించి వారి జీవనాధారమైన భూములను లాక్కోవడం ఏపాటి ప్రజాస్వామ్యం? ప్రభుత్వం భూములను చట్ట విరుద్ధంగా లాక్కోవడం సరైనదేనా? అసైన్డ్ భూములను అమ్మకూడదనే నిబంధన ఉన్నప్పుడు ప్రభుత్వం అమ్మడం చట్ట విరుద్ధం కాదా?

ఇప్పటికైనా ప్రభుత్వం తన తప్పుడు విధానాన్ని విరమించుకుని అసైన్డ్ భూములు కలిగినవారికి రక్షణ కల్పించాలి. భూస్వాముల దగ్గర గల మిగులు భూములను, అక్రమంగా ఆధీనంలో ఉన్న భూములను స్వాధీనం చేసుకుని ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చుకోవాలి తప్ప పేదల భూములను లాక్కోవడం ఆపేయాలి. ప్రజలు అసంతుష్టులుగా మారి ఆందోళనకు చేస్తే ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని సిపిఐ(ఎం) హెచ్చరిస్తున్నది.

**(తమ్మినేని వీరభద్రం)**
రాష్ట్ర కార్యదర్శి